సాక్షి రంగారెడ్డి

సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



మృత్యు తీగలు!

విద్యుత్ తీగలు మృత్యుపాశాలుగా మారుతున్నాయి. తరచూ ప్రమాదాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. 8లో▸



అభివృద్ధికి ప్రత్యేక నిధులు

గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందజేసి సమస్యలు పరిష్కరిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. 8లో▸

బంగారం పట్టివేత

శంషాబాద్: అక్రమంగా తరలిస్తున్న బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆదివారం ఉదయం దుబాయ్ నుంచి ఇండిగో విమానంలో వచ్చిన ఓ ప్రయాణికుడి కదలికలను అనుమానించి అతడి లగేజీని తనిఖీ చేశారు. అందులో ఉన్న మిక్సర్ విప్పి చూడగా 819 గ్రాముల బంగారం బయటపడింది. దీని విలువ రూ.49.79 లక్షలు ఉంటుందని అధికారులు నిర్ధారించారు.







తీజ్ సంబురం

కడ్తాల్ మండలం పల్లెచెలకతండాలో ఆదివారం గిరిజనుల సంప్రదాయ వేడుక తీజ్‌ను అంగరంగ వైభవంగా నిర్వహించారు. గిరిజన యువతులు మొలకల బుట్టలను నెత్తిన పెట్టుకుని ఊరేగింపుగా వెళ్లారు. యువతీయువకుల కేరింతలు, నృత్యాలతో సందడి వాతావరణం నెలకొంది. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయలకు తీజ్ ఉత్సవాలు ప్రతీకలని పలువురు నాయకులు పేర్కొన్నారు.

– కడ్తాల్

న్యూస్‌రీల్

సీఎంను కలిసిన గోలి శ్రీనివాస్‌రెడ్డి



గోలి శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించిన సీఎం కేసీఆర్

ఆమనగల్లు: రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎంను కలిసి రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్‌గా తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్‌రెడ్డిని ముఖ్యమంత్రి సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

నూతన నియామకం



వెంకన్నబాబుకు నియామకపత్రం అందజేస్తున్న డాక్టర్ డానియల్

షాద్‌నగర్‌రూరల్: జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా షాద్‌నగర్ పట్టణానికి చెంది వెంకన్నబాబును నియమించారు. ఈ మేరకు జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ మెహతాబ్‌రాయ్ ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం రాత్రి హైదరాబాద్‌లోని జాతీయ మానవ హక్కులు, సామాజిక న్యాయ సంఘం ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుక్కా డానియల్ చేతుల మీదుగా వెంకన్నబాబు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వెంకన్నబాబు మాట్లాడుతూ.. తనకు ఈ పదవి లభించడానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ డానియల్, రాష్ట్ర చైర్మన్ వేణు మాధవ్, సర్వేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సంఘం మహిళా విభాగం అధ్యక్షురాలు శీలం సరస్వతి, వైస్ చైర్మన్ శ్రావణ్‌కుమార్‌లోండే, రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ ఉపేందర్, రాష్ట్ర సెక్రటరీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పురస్కార ప్రదానం



పురస్కారాన్ని అందుకుంటున్న రవిప్రకాష్ హర్మాళ్

షాద్‌నగర్: జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని పుడమి సాహితీ వేదిక ఆధ్వర్యంలో నల్లగొండ పట్టణంలో ఆదివారం ఉత్తమ ఉపాధ్యాయులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ స్మారక పురస్కారాలను అందజేశారు. ఈ సందర్భంగా విద్యారంగాభివృద్ధికి కృషి చేస్తున్న షాద్‌నగర్ పట్టణానికి చెందిన యువ కవి, ఉపాధ్యాయుడు రవిప్రకాష్ హర్మాళ్ సాహితీ వేదిక జాతీయ అధ్యక్షుడు చిలుముల బాల్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు షేక్‌జానీ, ప్రధాన కార్యదర్శి కత్తుల హరిత చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు రవిప్రకాష్‌కు అభినందనలు తెలిపారు.

ముస్లిం మతపెద్దలతో మంత్రి సబిత భేటీ



పహాడీషరీఫ్: అసెంబ్లీ ఎన్నికలకు గడువు సమీపిస్తున్న నేపథ్యంలో రాజకీయ పార్టీలు తమకున్న అన్ని అవకాశాలను సద్వినియోగం చేసుకునే పనిలో పడ్డాయి. ఈ క్రమంలో ఆదివారం మంత్రి సబితారెడ్డి, ఆమె తనయుడు కార్తీక్ రెడ్డి జల్‌పల్లి మున్సిపల్ పరిధిలోని ముస్లిం మత పెద్దలు, ఇమాం, మోజంలతో పహాడీషరీఫ్‌లోని ప్రీమియర్ ఫంక్షన్‌హాల్‌లో సమావేశమయ్యారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ముస్లింల అభ్యున్నతికి తీసుకున్న నిర్ణయాలను వెల్లడించారు. ఈ ఐదేళ్ల కాలంలో ముస్లిం బస్తీల్లో చేసిన అభివృద్ధిని వివరించారు. లౌకికవాదం ముసుగులో వచ్చే పార్టీలను నమ్మొద్దన్నారు. మున్ముందు కూడా ముస్లిం మైనార్టీలకు సీఎం కేసీఆర్‌తోనే న్యాయం జరుగుతుందన్నారు.

పంటల లెక్క.. పక్కా

సర్వే నంబర్ల వారీగా వివరాల నమోదు

- క్షేత్రస్థాయిలో సమగ్రంగా పరిశీలించి ట్యాబ్‌లలో నిక్షిప్తం
- తగ్గిన పంటలను ప్రోత్సహించేందుకు చర్యలు

షాబాద్: పంటల నమోదు కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ జిల్లాలో ముమ్మరంగా కొనసాగిస్తోంది. సర్వేనంబర్ల వారీగా ఏఏ పంటలను ఎంతెంత విస్తీర్ణంలో రైతులు సాగు చేశారనే సమాచారం పక్కాగా ఉండాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం క్షేత్రస్థాయిలో నమోదు చేయాలని నిర్ణయించింది. ప్రజల ఆహార అవసరాల మేరకు సాగవుతున్నాయా లేదా అన్న సమాచారం తెలుసుకోవడం ద్వారా సాగు తగ్గితే వాటిని ప్రోత్సహించాలనే ప్రధాన లక్ష్యంతో కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. జిల్లా వ్యాప్తంగా ప్రస్తుత వానాకాలంలో రైతులు ఇప్పటి వరకు 12,95,879 ఎకరాల్లో వివిధ పంటలను సాగుచేశారు. అందులో 7,68,561 ఎకరాల్లో పత్తి, 3,08,618 ఎకరాల్లో వరి ఉన్నాయి. మొక్కజొన్న, కూరగాయలు, పూలు 2,02,156 ఎకరాల్లో సాగు చేశారు. అన్ని క్లస్టర్ల పరిధిలో వానాకాలం సీజన్ ప్రారంభమై పత్తి విత్తనాలను పెట్టుకోగానే పంటల నమోదు ప్రక్రియను ప్రారంభించారు.



ఏట్ల ఎర్రవల్లిలో పత్తి చేనులో వివరాలు నమోదు చేస్తున్న అధికారులు (ఫైల్)

వివరాలు నమోదు ఇలా..

ప్రతి రైతు వ్యవసాయ క్షేత్రానికి వ్యవసాయ విస్తరణ అధికారులు వెళ్తున్నారు. అక్కడ ఆ రైతు ఏఏ సర్వే నంబర్‌లో ఏఏ పంటలు, ఎంత విస్తీర్ణంలో సాగు చేశారు. రైతు పేరు, భూమి, బోరు బావులా, సాగు నీటి సౌకర్యం ఉందా అనే వివరాలను నమోదు చేస్తున్నారు. ట్యాబ్‌లో నమోదు చేసి ఫీల్డ్ నుంచే ఆన్‌లైన్‌లో ఫొటోలు రాష్ట్ర వ్యవసాయశాఖ కమిషనర్ కార్యాలయానికి పంపిస్తున్నారు. దీని ద్వారా పంటల దిగుబడి ఎంత వస్తుంది.. మార్కెట్ సౌకర్యం వంటి వాటి కోసం ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముందుస్తు చర్యలు తీసుకునేందుకు ఉప

పూర్తి కావచ్చింది



జిల్లాలో వానాకాలం పంటల సాగు వివరాల నమోదు దాదాపు పూర్తి కావచ్చింది. పత్తి పంట నమోదు ఇప్పటికే పూర్తి కాగా మొక్కజొన్న, వరి, పూలు, కురగాయాలు పంటలు 80 శాతం వరకు నమోదయ్యాయి. త్వరలో వదంశాతం పూర్తవుతుంది.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

తప్పని పడిగాపులు

- ఎల్‌ఆర్‌ఎస్‌లో కనిపించని పురోగతి
- సిబ్బంది కొరతతో ముందుకు సాగని దరఖాస్తుల పరిశీలన
- క్రమబద్ధీకరణకు నిరీక్షణ

సాక్షి, సిటీబ్యూరో: అక్రమ స్థలాల క్రమబద్ధీకరణపై ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేకుండా పోయింది. లక్షలాది మంది దరఖాస్తుదారులు తమ స్థలాల క్రమబద్ధీకరణ కోసం పడిగాపులు కాస్తున్నారు. హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగంలో సిబ్బంది కొరత కారణంగా దరఖాస్తుల పరిశీలన, పరిష్కార ప్రక్రియల్లో తీవ్రమైన జాప్యం చోటుచేసుకుంటోంది. వివిధ ప్రాంతాల్లో స్థలాలను కొనుగోలు చేసిన వారు ఎల్‌ఆర్‌ఎస్ పొందేందుకు ప్రభుత్వం మూడేళ్ల క్రితం అవకాశం కల్పించింది. స్థలాల యజమానులు రూ.1000 చెల్లించి దరఖాస్తు చేసుకున్నారు. అప్పట్లో ఎల్‌ఆర్‌ఎస్ జారీ అధికారాన్ని ప్రభుత్వం హెచ్‌ఎండీఏ నుంచి కలెక్టర్లకు అప్పగించింది. వివిధ కారణాలతో ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇటీవల ఎల్‌ఆర్‌ఎస్ జారీ అధికారాన్ని ప్రభుత్వం కలెక్టర్ల నుంచి తిరిగి హెచ్‌ఎండీఏకు అప్పగించింది. అంతేకుండా అప్పట్లో దరఖాస్తు చేసుకున్నవారికి ప్రస్తుతం ఎల్‌ఆర్‌ఎస్ పథకం కింద రెగ్యులరైజ్ చేయనున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అప్పట్లో ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించిన సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ నుంచి హెచ్‌ఎండీఏకు దరఖాస్తులు, సాంకేతిక వ్యవస్థ బదిలీ అయ్యాయి. ఘట్కేసర్, మేడ్చల్, శంషాబాద్, శంకర్‌పల్లి జోన్‌లకు చెందిన దరఖాస్తులను పరిశీలించి నిబంధనలకనుగుణంగా ఎల్‌ఆర్‌ఎస్ అందజేయాల్సి ఉండగా హెచ్‌ఎండీఏ ప్రణాళికా విభాగంలో సిబ్బంది కొరత కారణంగా ఇప్పట్లో రెగ్యులరైజ్ చేయడం సాధ్యం కాకపోవచ్చని అధికారులు చెబుతున్నారు.

గుట్టలుగా ఫైళ్లు..

- హెచ్‌ఎండీఏ ప్రణాళిక విభాగంలో ఫైళ్లు గుట్టలకొద్దీ పేరుకుపోతున్నాయి. సహాయ ప్లానింగ్ అధికారులు, జేపీఓలు, ఇతర విభాగాలకు చెందిన ఉద్యోగులు, సిబ్బంది తగిన సంఖ్యలో అందుబాటులో లేకపోవడంతో ఫైళ్లు ముందుకు సాగడం లేదు. నాలుగు జోన్‌ల పరిధిలో కనీసం 100 మంది సిబ్బంది ఇప్పటికిప్పుడు అవసరం కాగా, ప్రస్తుతం 20 మందే పని చేస్తున్నారు. దీంతో ఫైళ్ల పరిష్కారంలో జాప్యం చోటుచేసుకుంటోంది.
- లక్షల్లో ఉన్న ఎల్‌ఆర్‌ఎస్ ఫైళ్లకు ఇది మరింత ఆటంకంగా మారింది. మొదటిదశలో ఎకరానికి పైగా ఉన్న వెంచర్లలో మిగిలిపోయిన ప్లాట్లను క్రమబద్ధీకరించేందుకు చర్యలు చేపట్టారు. హెచ్‌ఎండీఏ పరిధిలోని మేడ్చల్, ఘట్‌కేసర్, శంషాబాద్, చేవెళ్ల జోన్ల నుంచి పెద్ద సంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఎల్‌ఆర్‌ఎస్‌కు అయ్యే ఖర్చులను కూడా చెల్లించిన వందలాది మంది ప్రొసీడింగ్స్ కోసం ఎదురు చూస్తుండగా, చిన్న ప్లాట్ల క్రమబద్ధీకరణ మరింత ఆలస్యమయ్యే పరిస్థితి నెలకొంది.

అతడిది నేరచరితే..!

- ప్రియురాలిపై దాడి. యువతి తమ్ముడి హత్య
- నాలుగేళ్ల క్రితం తండ్రిని హతమార్చిన శివకుమార్
- తాజా ఘటనతో చర్చనీయాంశం

షాద్‌నగర్/కొందుర్గు: మానవత్వాన్ని మరిచి మృగాడిలా వ్యవహరించాడు.. నాలుగేళ్ల క్రితం కన్న తండ్రిని సుత్తెతో కొట్టి హతమార్చాడు.. నేడు ప్రియురాలిపై హత్యాయత్నానికి పాల్పడటమే కాకుండా యువతి తమ్ముడిని దారుణంగా హతమార్చాడు. సీరియల్స్‌లో నటుడిగా జీవనం సాగిస్తున్న ఫరూఖ్‌నగర్ మండలం నేరేళ్లచెరువుకు చెందిన శివకుమార్ కర్కోటకుడిలా వ్యహరించాడు. కొందుర్గుకు చెందిన ఇందిర, సురేందర్‌గౌడ్ దంపతులకు కూతురు సంఘవి కుమారులు పృథ్వీ(23), రోహిత్ ఉన్నారు. సంఘవి తమ్ముడు పృథ్వీతో కలిసి హైదరాబాద్‌లోని ఎల్‌బీనగర్ ప్రాంతంలో ఉంటూ హోమియోపతిక్ వైద్యవిద్యలో నాలుగో సంవత్సరం చదువుతోంది. కొంత కాలంగా శివకుమార్ ప్రేమ పేరుతో సంఘవి వెంట పడుతున్నట్లు సమాచారం. పెళ్లి చేసుకోమని సంఘవిపై ఒత్తిడి చేయడంతో వారి మధ్య గొడవ జరిగింది. ఈ నేపథ్యంలో శివకుమార్ ఆదివారం సాయంత్రం ఎల్బీ నగర్‌లో ఉంటున్న సంఘవి వద్దకు వెళ్లి ఆమెపై కత్తితో దాడి చేశాడు. అడ్డుకోబోయిన తమ్ముడు పృథ్వీపై దాడి చేయడంతో అతను ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. సీరియల్‌లో నటుడిగా పని చేస్తున్న శివకుమార్ సైకోగా వ్యవహరిస్తున్నట్లు సమాచారం. ఇంట్లో గొడవల కారణంగా నాలుగేళ్ల క్రితం సొంత తండ్రి శంకరయ్యను సుత్తెతో తలపై బాది హత్య చేశాడు. తాజా ఘటనతో శివకుమార్ వ్యవహారం గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

కొందుర్గులో విషాదఛాయలు

పిల్లలంతా మూడు రోజుల క్రితమే రాఖీ పండుగకు స్వగ్రామానికి వచ్చారు. సంఘవి, పృథ్వీ శనివారం తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. ఇంతలోనే ఇలా జరిగింది. దాడి ఘటన విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు హుటాహుటిన నగరానికి వెళ్లారు. స్థానికంగా విషాదఛాయలు అలముకున్నాయి.

రాజకీయాల్లో రాణించాలి

- పద్మశాలీలు ఐక్య పోరాటాలకు సిద్ధం కావాలి
- అన్ని పార్టీలు ఆరు అసెంబ్లీ.. రెండు లోక్‌సభ స్థానాలు కేటాయించాలి
- పద్మశాలీ రాజకీయ శంఖారావంలో వక్తలు



అభివాదం చేస్తున్న నేతలు

హుడాకాంప్లెక్స్: తెలంగాణలో ఎనిమిదిశాతం జనాభా ఉన్న పద్మశాలీలకు అన్ని రాజకీయ పార్టీలు ఆరు అసెంబ్లీ, రెండు లోక్‌సభ స్థానాలు కేటాయించాలని పద్మశాలీ రాజకీయ శంఖారావం డిమాండ్ చేసింది. పద్మశాలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్‌రావు అధ్యక్షతన ఆదివారం సరూర్‌నగర్ స్టేడియంలోని కొండా లక్ష్మణ్ బాపూజీ ప్రాంగణంలో నిర్వహించిన పద్మశాలీ రాజకీయ శంఖారావానికి ఎమ్మెల్సీ ఎల్.రమణ, మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్, వరంగల్ కార్పొరేషన్ మేయర్ గుండు సుధారాణి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సభకు రాష్ట్రం నలుమూలల నుంచి పద్మశాలీలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ రమణ మాట్లాడుతూ.. 76 ఏళ్ల చరిత్రలో ఉమ్మడి రాష్ట్రంలో కేవలం 11 మంది పద్మశాలీలు మాత్రమే ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారని అన్నారు. వ్యాపార రంగంతో పాటు రాజకీయాల్లోనూ రాణించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనాభా ధామాషా ప్రకారం పద్మశాలీలకు రాజకీయ రిజర్వేషన్లు అమలు చేయాలని, ఇందుకోసం పద్మశాలీలంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ సహకారంతో రాష్ట్రంలోని చేనేత రంగంలో ఉన్న సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మాజీ ఎంపీ రాపోలు ఆనంద్ భాస్కర్ మాట్లాడుతూ.. పద్మశాలీలు రాజకీయంగా చైతన్యమైనప్పుడే పార్టీలు పిలిచి టికెట్లు ఇస్తాయని తెలిపారు. ఆ చైతన్యం జగిత్యాలలో ప్రారంభమైందని, ప్రస్తుతం సరూర్‌నగర్ స్టేడియంలో చూస్తున్నామన్నారు. పద్మశాలీల బతుకులు బాగుపడాలంటే రాజ్యాధికారం తప్పనిసరని పేర్కొన్నారు. చట్టసభల్లో ప్రాధాన్యత ఉంటేనే ఆత్మగౌరవం దక్కుతుందన్నారు. వరంగల్ మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు పద్మశాలీలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కొండా లక్ష్మణ్‌బాపూజీ పాత్ర కీలకమైందని, ఆయన ఆశయ సాధన కోసం కృషి చేద్దామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అఖిలభారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కందగట్ల స్వామి, రాష్ట్ర మహిళా కార్యదర్శి రావిరాల సంధ్యారాణి, అఖిలభారత మహిళా అధ్యక్షురాలు వనం దుష్యంతుల పాల్గొన్నారు.



ఆమనగల్లులో బోనాల ఊరేగింపు

బోన వైభవం

ఆమనగల్లు పట్టణంలో ఆదివారం రజక సంఘం ఆధ్వర్యంలో ఈదమ్మతల్లి బోనాలను ఘనంగా జరుపుకొన్నారు. మహిళలు బోనాలు ఎత్తుకుని బొడ్రాయి నుంచి ఊరేగింపుగా వెళ్లి ఈదమ్మ దేవాలయం వద్ద సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఊరేగింపులో పోతురాజుల విన్యాసాలు, డప్పుల దరువులు, యువతీయువకుల నృత్యాలతో సందడి నెలకొంది.

– ఆమనగల్లు



బోనం ఎత్తుకున్న యువతి

సామాజిక మాధ్యమాల్లో దుష్ప్రచారాలను నమ్మొద్దు

బంజారాహిల్స్: సోషల్ మీడియాలో వచ్చే దుష్ప్రచారాలను నమ్మవద్దని... వీటిపట్ల అప్రమత్తంగా ఉండాలని నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ సూచించారు. ఈ నెలలో వచ్చే వినాయక చవితి పర్వదినం, మిలాద్ ఉన్ నబీ పండగ ఊరేగింపు ఉన్న నేపథ్యంలో ఆదివారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నగరానికి చెందిన 500 మంది పీస్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే సమీపంలోని పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పండగలు, ఊరేగింపులు నిర్వహించుకోవాలని ఇందుకు పీస్ కమిటీలు సంపూర్ణ సహకారం అందించాలన్నారు. నగర శాంతి భద్రతలు, ప్రతిష్ఠలను దృష్టిలో పెట్టుకొని పీస్ కమిటీ సభ్యులు నిరంతరం సేవలు అందించాల్సిన అవసరం ఉందన్నారు.

ప్రయాణం.. కారాదు ప్రమాదం

వాగు దాటేందుకు యత్నం

- వరద ఉధృతికి కొట్టుకుపోయిన బైక్‌లు



వాగు నుంచి బైక్‌లు వెలికి తీస్తున్న టేకులపల్లి గ్రామస్తులు

కొందుర్గు: జిల్లా వ్యాప్తంగా శనివారం కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లాయి. ఇది గమనించని స్థానికులు బైక్‌పై ప్రయాణించడంతో బైక్‌లు నీటిలో కొట్టుకుపోగా బాధితులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. వివరాల ప్రకారం.. మండల పరిధిలోని టేకులపల్లి గ్రామానికి చెందిన శ్రీహరి, మల్లేశ్ శనివారం ఉదయం పనుల నిమిత్తం బయటకు వెళ్లారు. సాయంత్రం తిరుగు ప్రయాణంలో టేకులపల్లికి వెళ్తూ ఉత్తరాసిపల్లి, టేకులపల్లి మధ్యనున్న వంతెన దాటేందుకు యత్నించారు. వాగు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో బైక్‌లు వరదలో కొట్టుకుపోగా బాధితులు తృటిలో ప్రమాదం నుంచి బయటపడ్డారు. బైక్‌లను ఆదివారం బయటికి తీశారు.

పారిపోయిన వ్యక్తి.. ప్రమాదంలో మృతి

ఇబ్రహీంపట్నం రూరల్: పని చేయడం లేదని తల్లిదండ్రులు మందలించినందుకు మూడు నెలల క్రితం ఇంటి నుంచి పారిపోయిన యువకుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. ఈ ఘటన శనివారం అర్ధరాత్రి ఆదిబట్ల పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాస్‌రావు తెలిపిన ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా మూసాపేట్ మండలం, జానంపేట్ గ్రామానికి చెందిన పల్లి శివకుమార్(21) ఇంటర్ చదివి ఇంటి వద్దే ఉంటున్నాడు. తల్లిదండ్రులు మందలిచడంతో ఇంట్లోంచి పారిపోయి వచ్చాడు. ఈ క్రమంలో శనివారం రాత్రి కర్నూల్ జిల్లా డోన్ నుంచి కరీంనగర్‌కు టమాటా లోడ్‌తో బొలేరో వాహనం వెళ్తుంది. మార్గమధ్యంలో పంచలింగాల సమీపంలో శివకుమార్ లిఫ్ట్ అడిగి వాహనం ఎక్కాడు. అర్ధరాత్రి 12గంటల సమయంలో బొంగ్లూరు జంక్షన్ ఎగ్జిట్ నంబర్–12 వద్ద వాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టడంతో వాహనం బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ సుధాకర్‌కు స్వల్ప గాయాలవ్వగా శివకుమార్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి వద్ద లభించిన ఆధారాలతో తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. శవాన్ని ఇబ్రహీంపట్నం ప్రభుత్వాస్పత్రిలోని మార్చురీలో భద్రపరిచారు. కేసు దర్యాప్తులో ఉంది.

ఎక్స్‌ప్రెస్‌వేపై రోడ్డు ప్రమాదం

యువకుడి దుర్మరణం

- మరొకరికి తీవ్ర గాయాలు

రాజేంద్రనగర్: పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వేపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం ఉదయం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. రాంనగర్ గుండు ప్రాంతానికి చెందిన పి.శివ(25) డీజే ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. తన స్నేహితుడు మహేష్(33)తో కలిసి బైక్‌పై శంషాబాద్ ప్రాంతానికి వచ్చిన అతను ఆదివారం ఉదయం నగరానికి బయలు దేరాడు. పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్‌వే పైనుంచి వెళ్లేందుకు బైక్‌లకు అనుమతి లేకపోయినా నిబంధనలకు విరుద్ధంగా వారిద్దరూ ఎక్స్‌ప్రెస్‌వేపై మీదుగా వెళ్తుండగా పిల్లర్ 215 వద్ద గుర్తుతెలియని కారు వీరి బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎగిరి కిందపడటంతో తలకు తీవ్ర గాయాలైన శివ అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మహేష్‌ను వాహనాదారులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అంబులెన్స్‌లో అతడిని స్థానిక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. కాగా గత నాలుగు నెలలుగా ఎక్స్‌ప్రెస్‌వేపై ప్రమాదాల పరంపర కొనసాగుతోంది. త్వరగా వెళ్లాలన్న ఆలోచనతో కొందరు వ్యక్తులు ద్విచక్ర వాహనాలకు ఎక్స్‌ప్రెస్‌వేపై అనుమతి లేకపోయినా ఈ మార్గంలో ప్రయాణిస్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు.

బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ప్రధాన కార్యదర్శిగా పెద్దయ్య



నియామకపత్రం అందుకుంటున్న పెద్దయ్యయాదవ్

ఆమనగల్లు: బీసీ కుల సంఘాల ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శిగా మాడ్గుల మండలం నర్సింపల్లి గ్రామానికి చెందిన బీజేపీ నాయకుడు పెద్దయ్య యాదవ్ నియమితులయ్యారు. నగరంలోని బంజారాహిల్స్‌లో ఆదివారం నిర్వహించిన బీసీ కులసంఘాల ఐక్యవేదిక ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమంలో ఆయనకు రాష్ట్ర అధ్యక్షుడు కాటం నర్సింహయాదవ్ నియామకపత్రం అందించారు. ఈ సందర్భంగా పెద్దయ్యయాదవ్ మాట్లాడుతూ.. బీసీల ఐక్యతకు కృషి చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహయాదవ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు అంజయ్యగౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

ఆలయ పుష్కరిణిలో మృతదేహం లభ్యం



గుర్తుతెలియని మృతదేహం

చేవెళ్ల: మండల కేంద్రంలోని లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయ పుష్కరిణిలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఈ ఘటన ఆదివారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన ప్రకారం.. ఆలయ పుష్కరిణిలో మృతదేహం తేలియాడుతుండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని శవాన్ని బయటకు తీశారు. మృతుడి ఒంటిపై దుస్తులు లేకపోవడం.. గట్టుపైన బట్టలు లభించకపోవడంతో మృతిపై అనుమానాలున్నాయన్నారు. మృతుడి వయస్సు 40–50 ఏళ్ల మధ్య ఉంటుందని.. ఆధారాలు లభిస్తే కేసులో పురోగతి ఉంటుందని అభిప్రాయపడ్డారు. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం చేవెళ్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి వివరాలు తెలిసినవారుంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

మృత్యు తీగలు!

- ప్రమాదకరంగా మారిన విద్యుత్ వైర్లు
- ఇప్పటికే పలువురు మృతి
- పట్టించుకోని అధికారులు



పవన్‌కుమార్(ఫైల్)

కొత్తూరు: పక్కఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి మహబూబ్‌నగర్ జిల్లా నవాబుపేట మండలం గురుకుంట గ్రామానికి చెందిన పవన్‌కుమార్(25) కొన్నేళ్ల క్రితం జీవనోపాధి కోసం పట్టణానికి వచ్చాడు. ప్లంబర్‌గా పనిచేస్తూ భార్య, పిల్లలతో సంతోషంగా జీవనం సాగిస్తున్నారు. పనుల్లో భాగంగా ఆగస్టు 29న పట్టణంలోని నారాయణగూడ కాలనీలో ఓ ఇంటి పై అంతస్తులో వాటర్ ట్యాంకును ఏర్పాటు చేస్తున్నాడు. ఈ క్రమంలో ఇంటి మీదుగా వెళ్తున్న 33 కేవీ విద్యుత్ వైర్ల కారణంగా విద్యుత్ షాక్‌కు గురయ్యాడు. దీంతో చికిత్స నిమిత్తం ఆయన్ను ఉస్మానియా ఆస్పత్రికి తరలించగా ఆరు రోజుల తర్వాత మృతి చెందాడు.

- తిమ్మాపూర్ చౌరస్తా కాలనీలో నివసిస్తున్న ఇంటర్ విద్యార్థిని హర్షిత(17) సెలవులకు ఇంటికి వచ్చింది. బాల్కనీ బయట నిల్చుని ఉండగా హైటెన్షన్ వైర్ల కారణంగా విద్యుదాఘాతానికి గురై అక్కడికి అక్కడే మృతి చెందింది.

ఫలితం శూన్యం

ఇళ్లపై మీదుగా, రోడ్డు సమీపంలో తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ వైర్ల కారణంగా ఇలాంటి ప్రమాదాలు తరుచూ చోటు చేసుకుంటున్నా సంబంధిత శాఖల అధికారులు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శిస్తున్నారు. ప్రమాదాలు చోటు చేసుకున్నప్పుడు మాత్రమే హడావిడిగా సంఘటన స్థలానికి రావడం. కారణాలను తెలుసుకోవడం మినహాయించి మందస్తు చర్యలు చేపట్టడం లేదని ఆరోపిస్తున్నారు. మరోమారు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చర్యలు తీసుకోవడం లేదంటూ పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

తక్కువ ఎత్తులో ఉండడమే కారణం

జాతీయ రహదారి మీదుగా నిత్యం వందల సంఖ్యలో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. కాగా మార్గమధ్యలో డ్రైవర్లు కాలకృత్యాలు తీర్చుకోవడం.. విశ్రాంతి కోసం.. టార్పాలిన్లు కట్టేందుకు రోడ్డు పక్కన వాహనాలను నిలుపుతుంటారు. ఈ క్రమంలో పైన తక్కువ ఎత్తులో వేలాడుతున్న విద్యుత్ తీగలను గమనించకుండా వీరు వాహనాల పైకి ఎక్కడంతో విద్యుదాఘాతానికి గురవుతున్న ఘటనలు జాతీయ రహదారిపై తరుచూ చోటు చేసుకుంటున్నాయి. ఇళ్లపై బట్టలను ఆరవేసే క్రమంలో.. ఇంటి బాల్కనీలో నిలబడిన సమయాల్లో ఇళ్లకు సమీపం నుంచి వెళ్తున్న విద్యుత్ వైర్ల కారణంగా పలువురు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు.



కంచె లేకుండా ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్

గతంలో చోటు చేసుకొన్న ప్రమాదాలు

- నాలుగేళ్ల క్రితం ఎంఆర్‌ఎఫ్ టైర్ల లోడ్‌తో వెళ్తున్న కంటైనర్ డ్రైవర్ కాల కృత్యాలు తీర్చుకునేందుకు వెంకటేశ్వర హ్యచరీస్ ఎదుట జాతీయ రహదారి పక్కన వాహనాన్ని నిలుపుతున్నారు. పైన విద్యుత్ తీగలను గమనించకపోవడంతో టైర్లు, వాహనం కాలిబూడిదయ్యాయి. అదృష్టవశాత్తు డ్రైవర్ ప్రాణాలతో బయటపడ్డాడు.
- తిమ్మాపూర్ హెచ్‌ఐఎల్ పరిశ్రమ ఎదుట ఓ లారీ క్లీనర్ టార్పాలిన్ కప్పుతుండగా పైనున్న విద్యుత్ వైర్లు తగలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.
- తిమ్మాపూర్ చౌరస్తా కాలనీలో ఓ ఇంట్లో అద్దెకున్న బాలుడు ఇంటిపైకి వెళ్లి ఆడుకుంటుండగా సమీపంలోని విద్యుత్ తీగల కారణంగా ప్రమాదానికి గురయ్యాడు. అదృష్టవశాత్తు బాలుడు ప్రాణాలతో బయటపడ్డాడు.
- పారిశ్రామికవాడలో పత్తి విక్రయానికి వచ్చిన లారీని డ్రైవర్ రోడ్డు పక్కన నిలిపే క్రమంలో పైన ఉన్న విద్యుత్ తీగలను గమనించ లేదు. దీంతో పత్తికి మంటలు అంటుకోవడంతో డ్రైవర్ లారీని జనావాసాలకు దూరంగా తీసుకెళ్ళి నిలిపాడు. వెంటనే స్థానికులు స్పందించి మంటలు అంటుకొన్న పత్తిని లారీ నుంచి తొలగించారు.
- మూడేళ్ల క్రితం 5వ వార్డులోని ఓ ఇంటి పై అంతస్తులో మురుగు నీటి పైపులైన్‌ను సరిచేసే క్రమంలో ఇనుప రాడ్ బయట ఉన్న విద్యుత్ తీగలకు తగలడంతో ఇద్దరికి తీవ్రగాయాలవ్వగా.. ఒకరు మృతి చెందారు.

మున్సిపాలిటీలో విద్యుత్ కనెక్షన్ల వివరాలు

డొమెస్టిక్	6562
కమర్షియల్	640
ఇండస్ట్రియల్	185
అగ్రికల్చర్	225
స్ట్రీట్‌లైట్స్	60
గవర్నమెంట్ సర్వీసెస్	22

పట్టించుకోని అధికారులు

ఇళ్లపై నుంచి, సమీపం నుంచి తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్లను సరి చేయాలని స్థానికులు తరుచూ ట్రాన్స్‌కో అధికారులకు విన్నవిస్తున్నారు. అయినప్పటికీ వారు స్పందించడం లేదనే ఆరోపణలున్నాయి. ప్రతిపాదనలు పంపిస్తున్నామంటున్నారు తప్పితే ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికే ముగ్గురు మృతి



ఇళ్ల సమీపం నుంచి వెళ్లిన, తక్కువ ఎత్తులో ఉన్న విద్యుత్ వైర్ల కారణంగా విద్యుదాఘాతానికి గురై తిమ్మాపూర్‌లో ముగ్గురు మృతి చెందారు. మరి కొందరు ప్రమాదానికి గురయ్యారు. అయినప్పటికీ ట్రాన్స్‌కో అధికారులు చర్యలు తీసుకోవడం లేదు.

– కోస్గి శ్రీనివాస్, కౌన్సిలర్, 3వ వార్డు

నివేదికలు పంపిచాం



మున్సిపాలిటీలో పరిధిలో ప్రమాదకరంగా మారిన తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను పరిశీలించాం. వాటిని మార్చడానికి అయ్యే ఖర్చుల వివరాలు ఉన్నతాధికారులకు నివేదించాం. అత్యవసరంగా తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లు, స్తంభాలను మార్చాలంటే ప్రజలే ఖర్చు వెచ్చించాల్సి ఉంటుంది.

– సాయికృష్ణ, ఏఈ, ట్రాన్స్‌కో, కొత్తూరు

అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు

కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్



ప్రొసీడింగ్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

తలకొండపల్లి: గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు అందజేసి సమస్యలు పరిష్కరిస్తామని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అన్నారు. మండల పరిధిలోని వెంకట్‌రావు పేట గ్రామస్తులు ఆదివారం నగరంలోని ఎమ్మెల్యే నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామ పంచాయతీ కార్యాలయం శిథిలావస్థకు చేరిందని.. నూతన భవన నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే పంచాయతీ భవన నిర్మాణానికి రూ.20లక్షల నిధులకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను గ్రామ ప్రజాప్రతినిధులకు అందజేశారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ఎంపీటీసీ సభ్యురాలు సరిత, గణేశ్‌గుప్తా, సర్పంచ్‌లు హైమావతి, రమేశ్, లింగమ్మ, దశరథ్‌నాయక్, ఈశ్వర్‌నాయక్ తదితరులున్నారు.

వంద రోజులు కష్టపడితే అధికారం

పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు భీంభరత్



భీంభరత్‌ను సన్మానిస్తున్న యువత

షాబాద్: పార్టీ శ్రేణులు వంద రోజులు ఐక్యంగా కష్టపడితే కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని పీసీసీ ప్రచార కమిటీ కార్యనిర్వాహక సభ్యుడు పామెన భీంభరత్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మద్దూరు గ్రామం ఆయన్ను పలువురు నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. త్వరలోనే కాంగ్రెస్ పార్టీలో చేరుతామన్నారు. ఈ సందర్భంగా భీంభరత్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్లుగా ప్రజలను మోసం చేస్తున్నారని.. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా అధికారంలోకి వచ్చేది కాంగ్రెస్ పార్టీయేనన్నారు. సర్వేల ఆధారంగానే పార్టీ అధిష్టానం టికెట్ కేటాయిస్తుందని చెప్పారు. అధిష్టానం ఎంపిక చేసిన అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. కార్యకర్తలు నిరంతరం ప్రజల్లోనే ఉండాలని చెప్పారు. వందరోజులు తాము నియోజకవర్గాల పరిధిలోనే పర్యటిస్తామని, క్షేత్రస్థాయిలో పార్టీ పరిస్థితులను ఎప్పటికప్పుడు పరిశీలిస్తామన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

షాబాద్: రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. షాబాద్ సీఐ యాదయ్యగౌడ్ తెలిపిన ప్రకారం.. మండలంలోని సంకెపల్లిగూడకు చెందిన కద్మూరి అరవింద్‌గౌడ్ ఆగస్టు 27న బైక్‌పై వెళ్తుండగా గ్రామ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్ ఢీకొట్టింది. దీంతో క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం నగరంలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆయన పరిస్థితి విషమించి శనివారం రాత్రి మృతి చెందాడు. కేసు దర్యాప్తులో ఉంది. కాగా ఆదివారం జెడ్పీటీసీ సభ్యుడు పట్నం అవినాశ్‌రెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చారు. జెడ్పీటీసీ వెంట కార్పొరేషన్ మాజీ చైర్మన్ నాగేందర్‌గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ నక్క శ్రీనివాస్‌గౌడ్, సర్పంచ్ దర్శన్ తదితరులున్నారు.

వీధి కుక్కల దాడి

మృత్యువాత పడిన మూడు లేగదూడలు

కేశంపేట: వీధి కుక్కలు దాడి చేయడంతో మూడు లేగదూడలు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన మండల పరిధిలోని పాపిరెడ్డిగూడలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. గ్రామానికి చెందిన అబ్బి రవికుమార్ పాల వ్యాపారంతో జీవనం సాగిస్తున్నారు. రోజు మాదిరిగానే లేగదూడలను పొలం వద్ద ఉంచాడు. ఆదివారం ఉదయం కుక్కలు పశువులకు ఏర్పాటు చేసిన కంచె దాటుకుని వెళ్లి లేగదూడలపై దాడి చేసి చంపేశాయని తెలిపారు. ప్రభుత్వం స్పందించి రైతును ఆదుకోవాలని కోరారు.

లారీకి ముందు కారులో ఫైలెటింగ్

లారీ క్యాబిన్‌లో 208 కిలోల గంజాయి అక్రమ రవాణా

- రహస్య అరలో దాచి తెస్తున్న ముంబై ముఠా
- ఈ వాహనానికి ముందు ఫైలెటింగ్
- పట్టుకున్న టీఎస్–నాబ్ టీమ్
- ఐదుగురు నిందితుల అరెస్ట్

సాక్షి, సిటీబ్యూరో: గంజాయి అక్రమ రవాణా కోసం లారీ ట్రక్కు భాగంలో మార్పుచేర్పులు చేసిన ముఠాలు గతంలో అనేకం పోలీసులకు చిక్కాయి. అయితే నిఘాను తప్పించుకోవడానికి క్యాబిన్‌లోనే రహస్య అరను ఏర్పాటు చేసుకున్న మహారాష్ట్రలోని ఉస్మానాబాద్‌కు చెందిన గ్యాంగ్ తెలంగాణ స్టేట్ నార్కోటిక్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వింగ్‌కు (టీఎస్–నాబ్) పట్టుబడింది. ఈ లారీకి ముందు ఓ కారులో ముఠా సభ్యులు అడ్వాన్స్ పైలెటింగ్ చేస్తున్నట్లు గుర్తించామని ఎస్పీ డి.సునీతారెడ్డి ఆదివారం వెల్లడించారు. బషీర్‌బాగ్‌లోని సీసీఎస్ భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె వివరాలు వెల్లడించారు.

బంధుగణంతో ముఠా కట్టి...

ఉస్మానాబాద్‌కు చెందిన హసన్ గంజాయి వ్యాపారంలో దిట్ట. ఆంధ్రా–ఒడిస్సా బోర్డర్ నుంచి భారీగా సరుకు తీసుకువచ్చి పుణేలో తనకు అప్పగిస్తే రూ.2 లక్షలు కమీషన్‌గా ఇస్తానంటూ అదే ప్రాంతానికి చెందిన డ్రైవర్ రాజు అంబదాస్ షిండేకు ఆఫర్ ఇచ్చాడు. ఇందుకు అంగీకరించిన అతను తన బంధువులైన బాలాజీ అర్జున్ కాలే, నితిన్ నందకుమార్ గవాలీ, మధుకర్ అర్జున్ కాలే, సంజయ్ రవీంద్ర చౌహాన్‌లతో ముఠా ఏర్పాటు చేశాడు. తన స్నేహితుల నుంచి ఓ లారీ, కారు తీసుకున్నాడు. లారీ క్యాబిన్ లోపల, పై భాగంలో 250 కేజీల గంజాయి పట్టేలా ఓ రహస్య అర ఏర్పాటు చేయించాడు. రాజు, బాలాజీ, నిఖిల్ కారులో, మధుకర్, సంజయ్ లారీలో బయలుదేరి పార్వతీపురం ప్రాంతానికి చేరుకున్నారు.

ఆ రెండింటి మధ్య 30 కిమీ దూరం..

అక్కడ కొందరి నుంచి 104 ప్యాకెట్లు (ఒక్కోటి రెండు కేజీలు) గంజాయి ఖరీదు చేశారు. ఇందులో 200కేజీల లారీలో, 8 కేజీలో కారులో తీసుకుని బయలుదేరారు. లారీ ముందు అడ్వాన్స్ పైలెటింగ్ చేస్తున్న కారు 30 కిమీ ముందు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నారు. వాట్సాప్ కాల్, వాట్సాప్ లైవ్ లోకేషన్ ద్వారా ఒకరితో ఒకరు నిర్విరామంగా టచ్‌లోనే ఉండేవారు. ఆ మార్గంలో ఎక్కడైనా పోలీసు తనిఖీలు ఉంటే ఆ విషయాన్ని కారులోని వారు వెంటనే లారీలో వారికి సమాచారం అందించేవారు. ఈ ముఠా ముందుగా వేసుకున్న పథకం ప్రకారం పార్వతీపురం నుంచి విశాఖ–విజయవాడ–సూర్యాపేట–హైదరాబాద్ ఓఆర్ఆర్ మీదుగా పుణే చేరుకోవాలి. అయితే ఆఖరి నిమిషంలో తమ రూటును విజయవాడ నుంచి గుంటూరు–మాచర్ల –జడ్చర్ల–మహబూబ్‌నగర్ మీదుగా మార్చారు.

ఎస్వీబీతో కలిసి ఆపరేషన్..

ఈ ముఠా కదలికలపై టీఎస్–నాబ్‌కు సమాచారం అందడంతో ఏసీపీ కె.నర్సింగ్‌రావు నేతృత్వంలో ఇన్‌స్పెక్టర్లు పి.రాజేశ్, జీఎస్ డానియేల్, బి.విజయ్ భాస్కర్‌రెడ్డి తమ బృందాలతో రంగంలోకి దిగారు. ఆ రెండు వాహనాల్లో ఏ ఒక్కదాన్ని పట్టుకున్నా.. రెండో వాహనంలోని వారు పరారవుతారని భావించిన అధికారులు రెండు బృందాలుగా ఏర్పడ్డారు. రెండు వాహనాలను గుర్తించిన ఈ బృందాలు దాదాపు 208కిలోమీటర్ల దూరం వెంబడించి ఏకకాలంలో అడ్డగించి పట్టుకున్నాయి. మొత్తం ఐదుగురిని అరెస్టు చేసిన అధికారులు 208 కేజీల గంజాయి, లారీ, కారు స్వాధీనం చేసుకున్నారు. నిందితులు విచారణకు సహకరించట్లేదని, పోలీసు కస్టడీలోకి తీసుకున్న తర్వాత పూర్తి వివరాలు సేకరిస్తామని ఎస్పీ సునీతా రెడ్డి పేర్కొన్నారు. టీఎస్–నాబ్ తరఫు న ప్రతి జిల్లాకు ఓ డీఎస్పీ పని చేస్తున్నారని, డ్రగ్స్ వ్యవహారాలపై 8712671111కు సమాచారం ఇవ్వాలని కోరారు. 'క్లిష్టమైన భూభాగం కలిగిన ఏపీ ఏజెన్సీల్లో ఒకప్పుడు 50 వేల ఎకరాల్లో గంజాయి సాగు చేసేవారు, అక్కడి పోలీసులు తీసుకున్న చర్యలతో ఇది 10 వేల ఎకరాలకు తగ్గింది' అని ఆమె పేర్కొన్నారు.